నిధుల్లేక.. అస్తవ్యస్తం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. పదిహేను వార్డులుండగా ప్రత్యేకాధికారుల పాలనలో అభివృద్ధి కుంటుపడింది. నిధులు లేక పాలన అస్తవ్యస్తంగా తయారైంది. వర్షాకాలం కావడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. కొన్నిచోట్ల డ్రెయినేజీలు కరువై, మరికొన్ని చోట్ల పిచ్చిమొక్కలు పెరిగి, చెత్తతో నిండిపోయి అధ్వానంగా తయారయ్యాయి. దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నామని, ఈగలు, దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని బల్దియా ప్రజలు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు నివారణ చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. పారిశుద్ధ్య నిర్వహణకు, నూతన డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ప్రజలకు అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.


మిషన్ కాంపౌండ్‌కు వెళ్లే దారిలో నిలిచిన మురుగునీరు


మున్సిపల్ కార్యాలయం-ప్రభుత్వ ఆసుపత్రి మధ్యలో...


ఎస్సీ బాలుర వసతి గృహం చుట్టూ పిచ్చిమొక్కలు


తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు


అంబేద్కర్ చౌక్ సమీపంలో నిలిచిన మురుగు నీరు

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరణ



నెన్నెల: నెన్నెల తహసీల్దార్ పిప్పిరి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జ్యోతిప్రియదర్శిణి ఈ నెల 5న గుండెపోటుతో మృతి చెందారు. అప్పటి నుంచి డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇక్కడికి బదిలీపై తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విధాల సహకరిస్తానన్నారు. వివిధ అవసరాల కోసం వచ్చే వారు నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు.

అడ్మిషన్ల స్వీకరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీలో మిగిలి ఉన్న సీట్లకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడుతలో ఈ సీట్లు భర్తీ చేస్తున్నట్లు, ఈ నెల 28వరకు అడ్మిషన్ల కోసం అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐలో కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డీజిల్ మెకానికల్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్‌లో సీట్లు ఉన్నాయన్నారు. ఏటీసీలో సీఎన్‌సీ, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానిఫాక్చరింగ్ టెక్నీషియన్, మ్యానిఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమెషన్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికిల్, వర్చువల్ అనాలసిస్, డిజైనర్ ఎఫ్ఈఎంలతో సీట్లు ఉన్నాయని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రైతులు కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. లక్సెట్టిపేట మండలం కొమ్ముగూడెం చెరువుకు గండిపడి వరి పంట 200ఎకరాల వరకు నష్టం వాటిల్లిందని పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్‌కుమార్, రమేష్, సతీష్‌రావు, కిషన్, బి.సతీష్, వెంకటేష్, సుమన్, అశోక్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన నిర్మించాలని దీక్ష


రిలే నిరాహారదీక్షలో నాయకులు

తాండూర్: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలోని భీమన్న వాగుపై హై లెవల్ వంతెన నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన గిరిజన సంఘం నాయకులు ఆందోళన బాటపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు బాబురావు మాట్లాడుతూ.. భీమన్న వాగుపై ఉన్న లోలెవల్ వంతెన కుంగిపోవడం వల్ల వర్షకాలం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. అధికారులు స్పందించి వెంటనే హై లెవల్ వంతెన నిర్మించడంతో పాటు లచ్చుగూడెం వద్ద రోడ్డు డ్యామ్ నిర్మించాలని కోరారు. దీక్షలో స్థానిక నాయకులు సురేష్, సోము ,శ్రీను, పర్వతరావు, జంగు, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

20న బీసీ రాజ్యాధికార సభ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సున్నంబట్టి వాడలో ఈ నెల 20న నిర్వహించే బీసీ రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మహేశ్ వర్మ అన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ రాజ్యాధికార సభ సన్నాహక సమావేశాన్ని సోమవారం నాయకులతో కలిసి నిర్వహించారు. జిల్లాలోని బీసీలు, మేధావులు, ప్రజా, కుల సంఘాల నాయకులు, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వాన.. వరద!


సారంగపల్లిలో నీట మునిగిన వరిపైరు

- నీట మునిగిన కాలనీలు, పంటలు
- ఇబ్బంది పడ్డ ప్రజలు


ఆర్‌కేపీలో ఇళ్లల్లోకి చేరిన వరదనీరు

మందమర్రిరూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ, విద్యానగర్ కాలనీల్లో ఇళ్లు నీట మునిగాయి. రెండో జోన్‌లోని సింగరేణి క్వార్టర్లలోకి వర్షపు నీరు చేరడంతో కార్మిక కుటుంబాలకు ఇబ్బంది తప్పలేదు. సామగ్రి తడిసి ఆర్థిక నష్టం జరిగింది. మార్కెట్ ప్రాంతంలో కాలువలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో రోడ్డుపైనే నీరు నిలిచాయి. పాలవాగు, కొండెంగల వాగు, దొమ్మరివాగు, అందుగులపేటలోని రాళ్లవాగు ఉధృతంగా ప్రవహించాయి. ఎంపీడీవో రాజేశ్వర్, ఎస్సై రాజశేఖర్ గ్రామాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేశారు. అనవసరంగా బయటకు వెళ్లొద్దని హెచ్చరించారు. పంటలు నీట మునిగాయి. ఏరియాలోని ఓసీలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది.

రామకృష్ణాపూర్: భారీ వర్షాల కారణంగా రామకృష్ణాపూర్ పట్టణం అతలాకుతలమైంది. పట్టణంలోని పలు కార్మికవాడలు జలమయమయ్యాయి. పలుచోట్ల ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సూపర్‌బజార్ నుంచి కాకతీయకాలనీకి వెళ్లే మార్గంతో పాటు ఆర్‌కే1 మార్కెట్ ప్రాంతంలో వరదనీరు పూర్తిగా రోడ్డుపై నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు సింగరేణి క్వార్టర్లల్లోకి కూడా నీరు చేరడంతో నీటిని బయటకు పంపేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా క్వార్టర్లల్లోకి నీరు చేరి కార్మిక కుటుంబాలు ఇంతగా ఇబ్బందులు పడుతున్నా ఏ ఒక్క సింగరేణి అధికారి కూడా స్పందించకపోవటంపై పలువురు కార్మికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజుతో పాటు ఆయా పార్టీల నాయకులు వార్డులు తిరుగుతూ వరద పరిస్థితిని సమీక్షించారు.

ఉరుస్తున్న కలెక్టరేట్


కూలిన కలెక్టరేట్ ప్రహరీ

మంచిర్యాలఅగ్రికల్చర్: నాణ్యత లోపం వల్ల స్లాబు, గోడల నుంచి నీరు కారుతుంది. ప్రహరీ కూలిపోయింది. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మొదటి అంతస్తులోని భూగర్భజలశాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయం వద్ద ఊరుస్తోంది. ఫ్లోర్ జలమయంగా మారడంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

క్షీర జలపాతానికి జలకళ



జిల్లా కేంద్రానికి సుమారు పది కిలోమీటర్ల దూరం, మందమర్రి మండలంలోని అందుగులపేట గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్నటువంటి క్షీర జలపాతం జలకళతో కళకళలాడుతోంది. చూపరులను ఆకట్టుకుంటోంది. వర్షం కురిసే సమయంలో జలపాతం వద్దకు సందర్శకులు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

- మందమర్రిరూరల్

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా


మేళాలో ప్రదర్శనగా బోధన మెటీరియల్

మంచిర్యాలఅర్బన్/దండేపల్లి/జన్నారం/చెన్నూర్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సోమవారం టీఎల్‌ఎం మేళాలు నిర్వహించగా ఆకట్టుకున్నాయి. జిల్లా సైన్స్ సెంటర్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎల్‌ఎంను డీఈవో యాదయ్య పరిశీలించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో చిన్నయ్య, దండేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, జన్నారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో దత్తకుమార్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్ మేళాను ప్రారంభించారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు పాల్గొని బోధనకు సంబంధించిన మెటీరియల్‌ను మేళాలో ప్రదర్శించారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ప్రతీ తరగతి గదిలో బోధనకు సంబంధించిన మెటీరియల్ ఉండాలనే ఉద్దేశంతో టీఎల్‌ఎం మేళా నిర్వహిస్తున్నట్లు వక్తలు తెలిపారు.

ఘనంగా సర్వాయిపాపన్నగౌడ్ జయంతి


భీమారం: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు


జన్నారం: నినాదాలు చేస్తున్న నాయకులు

దండేపల్లి/భీమారం/కోటపల్లి/భీమిని/కాసిపేట/జన్నారం: సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. జన్నారం, దండేపల్లి, కోటపల్లి, కాసిపేట, భీమిని, భీమారం మండల కేంద్రాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జన్నారంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్, మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలసాని శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వల్లాల సర్సాగౌడ్, దండేపల్లిలో గౌడ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి రవిగౌడ్, పెరుమాండ్ల రవి, కోటపల్లిలో మండల అధ్యక్షుడు సంపత్‌గౌడ్, జిల్లా నాయకులు బాలరాజుగౌడ్, సుదర్శన్‌గౌడ్, కాసిపేటలో మోకుదెబ్బ మండల సలహాదారు పల్లె మల్లయ్య, భీమినిలో రాజాగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మహేశ్‌గౌడ్, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు


పత్తిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సుష్మ

తాండూర్: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి సుష్మ సోమవారం పరిశీలించారు. మండలంలోని తాండూర్, రేచిని, చౌటపల్లిలోని పత్తి, వరి క్షేత్రాలను సందర్శించి పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. వేరుకుళ్లు తెగులు రాకుండా కాపరాక్సిక్లోరైడ్ 3గ్రాముల మందును 1లీటరు నీటిలో కలిపి పత్తి మొదళ్ల చుట్టూ పిచికారీ చేయాలన్నారు. మల్టీ-కే మందును 5-10గ్రాముల ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ విస్తీర్ణాధికారి శంకర్, వెంకటేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కాసిపేట: భారీ వర్షాల కారణంగా పత్తి పంటలో నీరు నీల్వ ఉన్న ప్రాంతాల్లో నీరు బయటకు వెళ్లే విధంగా కాలువలు తీసుకోవాలని ఏఈవో శ్రీధర్ సూచించారు. మండలంలోని కనికలపూర్ శివారు పంట చేన్లను సోమవారం పరిశీలించి రైతులకు అవగాహన కల్పించి సూచనలు చేశారు.

బొగ్గుబాయి వార్తలు

ఓసీపీలో నిలిచిన ఉత్పత్తి

శ్రీరాంపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరాంపూర్ ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచింది. సోమవారం వర్షం కారణంగా ఓసీపీలో 12వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఓబీ పనులు నిలిచిపోయాయి. షవల్స్, డంపర్లు, ఇతర భారీ వాహనాలను ఉపరితలానికి తరలించారు. క్వారీల్లో చేరకుండా ఏర్పాట్లు చేశారు.

డైరెక్టర్ సత్యనారాయణరావుకు సన్మానం

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గల అడ్మిన్ భవన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి సంస్థలో డైరెక్టర్(ఈఅండ్‌ఎం) పనిచేసి ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న డి.సత్యనారాయణరావును ఘనంగా సన్మానించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, అధికారులు, ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో సీఎంవోఏఐ ప్రెసిడెంట్ శ్రీనివాస్, డీజీఎంలు ప్రభాకర్‌రావు, ఏజీఎంలు మురళీధర్, మదన్‌మోహన్, శ్రీనివాస్, కిరణ్‌బాబు, గిరిజన ఉద్యోగుల సెంట్రల్ ప్రెసిడెంట్ పంతులా పాల్గొన్నారు.

గనులపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే-1ఏ గనిపై సోమవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాసులు హాజరయ్యారు. గనుల్లో ఉద్యోగుల హాజరు శాతాన్ని, యంత్రాల పని గంటలను పెంచాలన్నారు. కార్యక్రమంలో మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశాల కన్వీనర్, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజన్న, రామకృష్ణరావు, విజయ్‌కుమార్, రాజేశ్, మేనేజర్లు నాగన్న, కోటయ్య, రక్షణాధికారి మహేశ్, సంక్షేమాధికారి అజ్మీర రమేశ్ పాల్గొన్నారు.

కేకే-ఓసీలో...

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి జీఎం, ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్ హాజరయ్యారు. కేకే-ఓసీ గనికి సంబంధించిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాన్ని తెలియజేశారు. అనంతరం కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో కమిటీ సభ్యులు బాలాజీ భగవతి ఝా, ఆర్‌వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, శ్యాంసుందర్, కిరణ్‌కుమార్, యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

'సమయాన్ని వృథా చేయొద్దు'

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి విధినిర్వహణలో సమయాన్ని వృథా చేయొద్దని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, స్టోర్స్‌లలో సోమవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, స్టోర్స్ డీజీఎం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

30న బహుమతుల ప్రదానోత్సవం


అధికారులతో మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం

శ్రీరాంపూర్: ఈ నెల 30న 55వ వార్షిక రక్షణ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శ్రీరాంపూర్‌లో నిర్వహించనున్నట్లు కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఏరియా అధికారులతో మాట్లాడారు. రక్షణ వారోత్సవాల్లో భాగంగా కంపెనీ వ్యాప్తంగా రక్షణ తనిఖీ కమిటీలు అన్ని గనులు, డిపార్టుమెంట్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఉత్తమ గనులు, డిపార్టుమెంట్లను గుర్తించామన్నారు. వారికి 30న జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్సా, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి చిప్ప వెంకటేశ్వర్లు, ఏజెంట్‌లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్ కుమార్, రవీందర్ మల్లయ్య, హరినారాయణ, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

మంచిర్యాలక్రైం: వినాయక మండపాలకు అనుమ తి తీసుకోవాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్‌నంబర్లు, ప్రతిష్ఠించే రోజు, నిమజ్జనం వివరాలు అందజేయాలని తెలిపారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉంచి రైతులకు పంపిణీ చేయాలని భీమిని వ్యవసాయ సహాయ సంచాలకురాలు సురేఖ అన్నారు. మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ప్రతీ దుకాణం ఎదుట స్టాక్‌బోర్డు పెట్టాలని సూచించారు. వేమనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రుక్సార్ సుల్తాన, రైతులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గ్రామ మాజీ ఉపసర్పంచ్ జనార్దన్ వర్ధంతి సందర్భంగా సోమవారం అతడి కుమారులు రఘువరన్, వెంకటేష్ మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జీపీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామానికి చెందిన 20మంది యువకులు రక్తదానం చేసినట్లు జిల్లా ఆలిండియా రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్ తెలిపారు.

20న విద్యుత్ పరిష్కార వేదిక

నెన్నెల: మండలంలోని రైతు వేదికలో ఈ నెల 20న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి డీఈఈ బి.రాజన్న తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికకు సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ వస్తున్నట్లు చెప్పారు. నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల వినియోగదారులు తమ సమస్యలను ప్రత్యక్షంగా చెప్పి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీలోని ఎర్రగుంట చెరువుకు గండికొట్టి కబ్జా చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని రైతు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ పట్టణ అధ్యక్షుడు టి.మణిరామ్ సింగ్, సీపీఐఎంఎల్ న్యూడెమెక్రసీ రాష్ట్ర నాయకుడు ఎండి.చాంద్‌పాషా, ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి గోగర్ల శంకర్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

కాసిపేట/నెన్నెల: కాసిపేట, నెన్నెల మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. కాసిపేట మండలం కోమటిచేనులో ఆదివాసీల భూములను అక్రమ పట్టాలు చేసుకున్న పట్టాను తొలగించి ఆదివాసీలకు న్యాయం చేయాలని గోండ్వాన పంచాయత్ రాయి సెంటర్ ఆధ్వర్యంలో ఆదివాసీలు సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో తహసీల్దార్‌కు విన్నవించారు. నెన్నెలలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

చెన్నూర్‌లో ఎరువుల పంపిణీ

చెన్నూర్: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం వద్ద సోమవారం ఎరువులు పంపిణీ చేసినట్లు ఏవో యామిని తెలిపారు. చెన్నూర్ మండలానికి సరఫరా అయిన 40మెట్రిక్ టన్నులు, 888యూరియా బస్తాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

జైపూర్: మండల కేంద్రంలో వెన్నెల మహిళా సంఘాల సభ్యుల సమావేశాల నిర్వహణకు గతంలో కేటాయించిన స్థలాన్ని ఇతర వ్యక్తులు ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షురాలు మద్దుల సునీతరెడ్డి, ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న, కోశాధికారి దీపిక, సభ్యులు డిమాండ్ చేశారు. సుమారు 300మంది మహిళలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వనజారెడ్డికి భూ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని హైటెక్‌సిటీ కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్లు వరద నీటిలో ముంపునకు గురవగా, కాలనీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ సోమవారం కాలనీలో పర్యటించారు. వరద నీటిలో మునిగిన రోడ్లను పరిశీలించి, వరద సమస్యకు త్వరలోనే పరిష్కారం చేస్తామని అన్నారు. వరద ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు పర్యటించారు.

'పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

నెన్నెల: భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. మండలంలో కుండపోత వర్షానికి దెబ్బతిన్న పత్తిచేళ్లు, వరి పొలాలను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిహారం అందించి ఆదుకోని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది'

నెన్నెల: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్ అన్నారు. వర్షాలకు నష్టపోయిన పంటలను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు అధైర్యపడి ఆందోళన చెందవద్దన్నారు.